# క్రైం కౌంటర్

ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం

తెలుగు దినపత్రిక

సంపుటి : 02 సంచిక : 87 శుక్రవారం 26-12-2025 పేజీలు : 4 వెల : 4/-

Website:- https://www.crimecounter.in/



క్రైం కౌంటర్ News

ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం

తెలంగాణ సూర్యాపేట జిల్లా తెలుగు దినపత్రికలో పనిచేయుటకు

రిపోర్టర్లు కావలెను

- జిల్లా బ్యూరోలు
- నియోజక వర్గ ఇన్చార్జీలు

Contact No: 98497 07349


## వరల్డ్ కప్ 2026 టీమ్ ఎంపికలో తప్పిదం..!




- కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన ....
- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి..
- యేసుక్రీస్తు బోధనలు ఆరాధనతో మార్మోగిన చర్చిలుహో
- హిత బోధ చేసిన ఆయా చర్చిల పాస్టర్లుహో!

క్రైమ్ కౌంటర్ న్యూస్ ప్రతినిధి కల్వకుర్తి:- కల్వకుర్తి పట్టణంలో గురువారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఎంబి వార్కిటిన్ మెమోరియల్ చర్చి తో పాటు ఆయా చర్చిలలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఎంబి వర్కంటిన్ మెమోరియల్ చర్చి లో ఉదయం 11 గంటల నుంచి 3 గంటల వరకు నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలో క్రైస్తవులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. యేసు ప్రభువును కోలుస్తు భక్తులు ఆలాపించిన దైవభక్తి గీతాలు కీర్తనలు అల రించాయి, ఈసందర్భంగా పాస్టర్లు ఏసుక్రీస్తు జన్మదిన విశిష్టత ను వివరించారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాజీ సర్పంచ్ ఆనంద్ కుమార్ తో పాటు స్థానిక ప్రజా ప్రతినిధులు చర్చిలకు వెళ్లి కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతు.ఏసుక్రిస్తు అనుగ్రహంతో ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ మానిటరింగ్ కమిటీ సభ్యులు జిల్లెల్ల రాములు, పట్టణ అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి, సర్పంచ్ లు ఆంజనేయులు, రమేష్ నాయక్, మార్కెట్ డైరెక్టర్ రమాకాంత్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ శ్రీనివాసులు, కాంగ్రెస్ నాయకులు, సంతు యాదవ్, ఎంబి సంఘం చర్చి చైర్మన్ జోవాన్న విల్సన్, స్టీవెన్ సన్, రామస్వామి, జగదీష్, కృష్ణమూర్తి, వింజమూరు రాజు, ప్రేమ్ కుమార్, నేరటి రవి, జ్యోతి ప్రసాద్, నందు, చింటూ, బొల్లె రాజు, తదితరులు పాల్గొన్నారు.




## ఎక్కడ నుంచి ఎక్కడి వరకంటే..



తెలంగాణ ప్రభుత్వం ఔటర్ రింగ్ రోడ్డు (ORR) నుండి రీజినల్ రింగ్ రోడ్డు (RRR) మధ్య రవాణాను మెరుగుపరచడానికి 16 గ్రీన్‌ఫీల్డ్ రహదారుల నిర్మాణాన్ని చేపట్టింది. సమగ్ర మొబిలిటీ ప్లాన్‌లో భాగంగా హెచ్ఎండీఏ ఈ భారీ ప్రాజెక్టును పర్యవేక్షిస్తోంది. ప్రస్తుతం రావిర్యాల నుంచి ఆమన్‌గల్ (41 కి.మీ), బుద్వేల్ నుంచి కోస్గి (81 కి.మీ) రహదారుల డీపీఆర్ పనులకు ప్రాధాన్యతనిస్తున్నారు. ఈ రహదారులు పారిశ్రామిక ప్రాంతాలను కలుపుతూ.. శివార్లలో 3.5 లక్షల ఇళ్ల నిర్మాణానికి ఊతమిస్తాయి. 2047 లక్ష్యంగా 11 జిల్లాలను అనుసంధానిస్తూ.. ప్రజల రవాణా కష్టాలను తీర్చడమే ఈ ప్రాజెక్ట్ ప్రధాన ఉద్దేశం. ఈ కొత్త రహదారుల వెంట భారీ టౌన్‌షిప్‌లు, లాజిస్టిక్ హబ్‌లు ఏర్పాటు కానున్నాయి. తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ చుట్టూ మౌలిక సదుపాయాల కల్పనలో ప్రభుత్వం సరికొత్త అధ్యాయాన్ని లిఖిస్తోంది. ప్రధానంగా 16 గ్రీన్‌ఫీల్డ్ రహదారుల నిర్మాణం ద్వారా నగరాన్ని విశ్వనగరంగా తీర్చిదిద్దేందుకు హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (HMDA) భారీ ప్రణాళికను సిద్ధం చేసింది. ప్రస్తుతం ఉన్న ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) నుండి ప్రతిపాదిత రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) వరకు నేరుగా అనుసంధానం ఏర్పరచడమే ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశం. సాధారణంగా పాత రోడ్లను విస్తరించడం వల్ల అనేక ఇబ్బందులు ఎదురవుతాయి.అందుకే.. ఎక్కడా జనాభా రద్దీ లేని కొత్త ప్రాంతాల గుండా ఈ గ్రీన్‌ఫీల్డ్ రహదారులను నిర్మిస్తున్నారు. దీనివల్ల ప్రయాణ సమయం తగ్గడమే కాకుండా.. నగర శివార్లలో కొత్త పారిశ్రామిక కేంద్రాలు అభివృద్ధి చెందుతాయి. మొత్తం 16 రహదారులలో మొదటి దశలో రెండు ప్రధాన మార్గాలపై ప్రభుత్వం దృష్టి సారించింది. దీనిలో రావిర్యాల - ఆమన్‌గల్ రహదారి ఒకటి. ఇది సుమారు 41 కిలోమీటర్ల మేర సాగనుంది. దక్షిణ తెలంగాణ ప్రాంతాలను నగరంతో వేగంగా కలిపేందుకు ఇది కీలకం కానుంది. బుద్వేల్ - కోస్గి రహదారి మరొకటి. ఇది దాదాపు 81 కిలోమీటర్ల పొడవైన భారీ మార్గం. ఇది బుద్వేల్ నుండి ప్రారంభమై చందన్వెల్లి, పేరారం, గూడూరు, దోర్నాలపల్లి, దోమ మీదుగా ముఖ్యమంత్రి నియోజకవర్గమైన కొడంగల్ (కోస్గి) వరకు చేరుకుంటుంది. ఈ రహదారిని 167వ జాతీయ రహదారితో అనుసంధానించనున్నారు. తెలంగాణ రైజింగ్-2047 నివేదిక ప్రకారం.. హైదరాబాద్ పరిధిని 7,250 చదరపు కిలోమీటర్ల నుండి 10,050 చదరపు కిలోమీటర్ల వరకు విస్తరించారు. ఈ క్రమంలో 11 జిల్లాల పరిధిలోకి హెచ్ఎండీఏ కార్యకలాపాలు విస్తరించాయి. రీజినల్ రింగ్ రోడ్డు చుట్టూ సుమారు 3.5 లక్షల ఇళ్లను నిర్మించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ 16 రహదారుల వెంట భారీ టౌన్‌షిప్‌లు ఏర్పాటు కానున్నాయి. టి.జి.ఐ.ఐ.సి (TGIIC) ఆధ్వర్యంలోని పారిశ్రామిక ప్రాంతాలను ఈ రహదారులు కలుపుతాయి. దీనివల్ల లాజిస్టిక్ హబ్స్, వేర్‌హౌసింగ్ రంగం భారీగా పుంజుకుంటుంది. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని అడవుల సంరక్షణ, జలవనరుల నిర్వహణ , ఆర్థికాభివృద్ధిని సమతుల్యం చేస్తూ ఈ రోడ్ల డిజైన్ రూపొందించారు.ప్రస్తుతం బుద్వేల్ - కోస్గి మార్గంలో భూసేకరణకు సంబంధించి రైతుల నుండి కొన్ని అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా పరిహారం పెంపు విషయంలో రైతులు డిమాండ్ చేస్తున్నారు. అయితే.. ప్రభుత్వం ఈ పనులను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నందున.. రైతులకు న్యాయం చేస్తూనే అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్లేందుకు సమగ్ర ప్రాజెక్టు నివేదికను (DPR) సిద్ధం చేస్తోంది. ఈ రహదారులు పూర్తయితే.. వికారాబాద్, రంగారెడ్డి , మహబూబ్‌నగర్ జిల్లాల రూపురేఖలు పూర్తిగా మారిపోతాయి. మొత్తం 11 జిల్లాలు ఈ అభివృద్ధి ప్రణాళికలో భాగంగా ఉన్నాయి. ఈ 16 రహదారులు ప్రధానంగా కింది జిల్లాల గుండా లేదా ఆ జిల్లాలను కలుపుతూ సాగుతాయి. రంగారెడ్డి (రావిర్యాల, మహేశ్వరం, శంషాబాద్ ప్రాంతాలు), వికారాబాద్ (కోస్గి, కొడంగల్ వైపు వెళ్లే మార్గాలు), సంగారెడ్డి (పారిశ్రామిక ప్రాంతాల అనుసంధానం), యాదాద్రి భువనగిరి (తూర్పు వైపు విస్తరణ), మెడ్చల్-మల్కాజిగిరి (ఉత్తర కారిడార్), మహబూబ్‌నగర్ (దక్షిణ తెలంగాణ కనెక్టివిటీ), నల్గొండ (సాగర్ రోడ్డు వైపు విస్తరణ), సిద్దిపేట, మెదక్, కామారెడ్డి మరియు జనగామ జిల్లాల సరిహద్దులను కూడా ఈ రహదారులు వెళ్తాయి.

## కాలేజ్ బస్ ప్రమాదం: జిల్లా పోలీసుల తక్షణ చర్యలతో తప్పిన పెద్ద ప్రమాదం..



క్రైమ్ కౌంటర్ న్యూస్ ప్రతినిధి మహబూబ్ నగర్ జిల్లా: -

మణికంఠ జూనియర్ కళాశాలకు, నారాయణపేట జిల్లా మరికల్ మండలానికి చెందిన బాలబాలికలతో వెళ్తున్న కాలేజ్ బస్, హైదరాబాదులోని జల విహార్‌కు వెళ్తున్న సమయంలో మహబూబ్ నగర్ జిల్లా బాలానగర్ మండలం పెద్దయపల్లి గ్రామ శివారులో ప్రమాదానికి గురైంది. ముందుగా వెళ్తున్న ఒక కారు అకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో, దానిని తప్పించబోయిన కాలేజ్ బస్ అదుపుతప్పి రోడ్డుకు అడ్డంగా పడింది.ఈ బస్సులో మొత్తం 40 మంది విద్యార్థులు ప్రయాణిస్తుండగా, అందులో 10 మందికి స్వల్ప గాయాలు అయ్యాయి. ప్రమాద సమాచారం అందిన వెంటనే మహబూబ్‌నగర్ జిల్లా పోలీసులు తక్షణమే స్పందించి సంఘటన స్థలానికి చేరుకున్నారు.ఈ ఘటనను జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్, డీఎస్పీ వెంకటేశ్వర్లు, జడ్చర్ల రూరల్ సీఐ నాగార్జున గౌడ్ మరియు బాలానగర్ ఎస్సైలు స్వయంగా సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. గాయపడిన విద్యార్థులను వెంటనే చికిత్స కోసం షాద్నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడంతో పాటు, ప్రమాద స్థలంలో ట్రాఫిక్ అంతరాయం లేకుండా వేగంగా క్లియర్ చేయడం జరిగింది.పోలీసుల తక్షణ చర్యలు మరియు సమర్థవంతమైన నిర్వహణ వల్ల ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా పరిస్థితిని పూర్తిగా అదుపులోకి తీసుకువచ్చారు.

## ఆ జిల్లాలకు మహర్దశ..



ఉత్తర తెలంగాణ క్రీడాకారుల చిరకాల స్వప్నం నెరవేరనుంది. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ చొరవతో జమ్మికుంటలో రూ. 6.5 కోట్లతో అత్యాధునిక సింథటిక్ అథ్లెటిక్స్ ట్రాక్ ఏర్పాటుకు కేంద్రం అనుమతులు మంజూరు చేసింది. 'ఖేలో ఇండియా' పథకం కింద నిర్మించనున్న ఈ ట్రాక్, గ్రామీణ క్రీడాకారులకు ప్రపంచ స్థాయి శిక్షణ అవకాశాలను అందించి, ఉత్తర తెలంగాణను క్రీడా కేంద్రంగా తీర్చిదిద్దనుంది. ఉత్తర తెలంగాణలోని క్రీడాకారుల చిరకాల స్వప్నం నెరవేరబోతోంది. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రత్యేక చొరవ, కేంద్ర ప్రభుత్వ సానుకూల నిర్ణయంతో కరీంనగర్ జిల్లా జమ్మికుంటలో అత్యాధునిక సింథటిక్ అథ్లెటిక్స్ ట్రాక్ ఏర్పాటుకు మార్గం సుగమమైంది. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన క్రీడాకారులను అంతర్జాతీయ స్థాయి ఛాంపియన్లుగా తీర్చిదిద్దాలనే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సంకల్పంలో భాగంగా.. 'ఖేలో ఇండియా' పథకం కింద ఈ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం పరిపాలనా పరమైన అనుమతులు మంజూరు చేసింది. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టు కోసం కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ రూ. 6.5 కోట్లు కేటాయిస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఈ అధునాతన ట్రాక్‌ను నిర్మించనున్నారు. వరల్డ్ అథ్లెటిక్స్ (IAAF) నిర్దేశించిన అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా 400 మీటర్ల పొడవు, 4 లైన్లతో ఈ సింథటిక్ ట్రాక్ రూపుదిద్దుకోనుంది. సాధారణంగా మట్టి ట్రాక్‌లపై శిక్షణ పొందే గ్రామీణ క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీలకు వెళ్లినప్పుడు అక్కడి సింథటిక్ ట్రాక్‌ల స్వభావాన్ని అర్థం చేసుకోలేక ఇబ్బంది పడుతుంటారు. ఇప్పుడు జమ్మికుంటలోనే ఇటువంటి సౌకర్యం అందుబాటులోకి రావడం వల్ల, క్రీడాకారులు తమ సొంత ప్రాంతంలోనే ప్రపంచ స్థాయి ప్రమాణాలతో శిక్షణ పొందే అవకాశం లభిస్తుంది. ఈ ప్రాజెక్టు కేవలం జమ్మికుంటకే పరిమితం కాకుండా కరీంనగర్, హన్మకొండ, జగిత్యాల మరియు పెద్దపల్లి జిల్లాల సరిహద్దుల్లోని వేలాది మంది క్రీడాకారులకు వరం కానుంది. సింథటిక్ ట్రాక్‌తో పాటు లాంగ్ జంప్, హై జంప్ వంటి ఇతర అథ్లెటిక్స్ క్రీడలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కూడా ఇక్కడ అభివృద్ధి చేసే అవకాశం ఉంది. ఈ ట్రాక్ నిర్మాణంపై బండి సంజయ్ హర్షం వ్యక్తం చేస్తూ, ఈ నిధులను సద్వినియోగం చేసుకుని రాష్ట్ర ప్రభుత్వం పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని కోరారు.కేంద్ర ప్రభుత్వ 'ఖేలో ఇండియా' పథకం ఉద్దేశ్యం క్రీడలను అట్టడుగు స్థాయికి తీసుకెళ్లడం. జమ్మికుంట వంటి ప్రాంతంలో ఇలాంటి ప్రాజెక్టు రావడం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న క్రీడా నైపుణ్యం వెలుగులోకి వస్తుంది. త్వరలోనే ఈ ట్రాక్ నిర్మాణానికి భూమి పూజ నిర్వహించి, ఏడాది లోపే క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఈ ఆధునిక ట్రాక్ అందుబాటులోకి వస్తే, ఉత్తర తెలంగాణ భవిష్యత్తులో దేశానికి మేటి అథ్లెట్లను అందించే క్రీడా కేంద్రంగా అవతరించడం ఖాయం.

## నిరుపేదల కంటి చూపుకి చిరునామాగా మారిన సుంకిరెడ్డి..




- ఐదురోజులుగా దిగ్విజయంగా సేవలు అందిస్తున్న..
- ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు టాస్క్ సి ఓ ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిభిరం...

క్రైమ్ కౌంటర్ న్యూస్ ప్రతినిధి రంగారెడ్డి జిల్లా మాడుగుల: - గురువారం ప్రారంభమైన కంటి శుక్లాల ఆపరేషన్ల ప్రక్రియ..మొదటగా 29 మంది కంటి శుక్లాల పేషెంట్లకు విజయవంతంగా" ఆపరేషన్లు" పూర్తి.ఐదు రోజులుగా.. సుమారు 3,000 మంది వరకు శిబిరానికి హాజరవ్వగా.2,029 మందికి ఉచితంగా కంటి పరీక్షల నిర్వహణ,1350 మందికి పైగా ఉచిత కంటి అద్దాల పంపిణీ,129 మంది పేషెంట్లు కంటి శుక్లాల ఆపరేషన్లకు ఎంపిక.ఐక్యత ఫౌండేషన్&ప్రముఖ వైద్య నిపుణులు శంకర నేత్రాలయ చెన్నై వారిచే నిర్వహిస్తున్న ఉచిత కంటి శిబిరాన్ని ఐదవ రోజు సందర్శించిన..మాడుగుల మాజీ ఎంపీపీ సూదిని రాంరెడ్డి మాట్లాడుతూ.. మాడుగుల ప్రజలకు ఇంత పెద్ద స్థాయిలో ఉచిత కంటి వైద్య సేవలు అందించడం అభినందనీయమని, కంటి వైద్యం ఖరీదుతో కూడుకున్నదని,అలాంటి పరిస్థితుల్లో సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ముందుకు వచ్చి పూర్తిగా ఉచితంగా శస్త్రచికిత్సలు చేయిస్తూ,కంటి అద్దాలు అందించడం నిజంగా గొప్ప సేవ అని పేర్కొన్నారు,ఇప్పటికే వేల మంది ఈ శిబిరం ద్వారా కంటి పరీక్షలు చేయించుకుని లబ్ధి పొందారని కంటి శుక్లాల ఆపరేషన్లు కూడా విజయవంతంగా ప్రారంభించారని,సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ఇలాంటి సేవా కార్యక్రమాలను భవిష్యత్తులో కూడా కొనసాగించాలని, నిరుపేదల కంటి చూపుకు చిరునామాగా మారిన ఈ ఉచిత కంటి వైద్య శిబిరం సమాజానికి ఆదర్శంగా నిలుస్తోందని ప్రశంసించారు, గురువారం క్యాంపు వివరాలుతెలిపిన ఐక్యత మాడుగుల ఇంచార్జ్ సూదిని జైపాల్ రెడ్డి మాట్లాడుతూ..గురువారం శిబిరానికి 800 మంది హాజరవ్వగా,539 మందికి ఉచిత కంటి పరీక్షలు నిర్వహించగా,350 కి పైగా ఉచిత కంటి అద్దాలను పంపిణీ చేశామని,31 మంది పేషెంట్లు కంటి శుక్లాల ఆపరేషన్లకు ఎంపిక అయ్యారని తెలిపారు, 27 శనివారంతో ముగియనున్న కంటి పరీక్షలు, 29 సోమవారం వరకు కొనసాగనున్న కంటి ఆపరేషన్లుఈ సదవకాశాన్ని వినియోగించుకోగలరని కోరారు.ఈ కార్యక్రమంలో.. మాడుగుల సర్పంచ్ ముధేంటి రజిత దేవయ్య గౌడ్, మాజీ సర్పంచ్ కాట్ల యాదయ్య గౌడ్,ఉప సర్పంచ్ సూదిని శరత్ రెడ్డి,వార్డు మెంబర్ చిన్న కృష్ణ, జెల్ల ఆంజనేయులు గౌడ్,మద్దెల గణేష్ స్థానిక నాయకులు అరవింద్ గౌడ్,విజయ్,అన్నేపాక కిరణ్ కుమార్,కుమార్ లతో పాటు ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## పదకొండు నెల అబ్బాయి గుండె ఆపరేషన్ కి 25000 ఆర్థిక సాయం..

తెలంగాణ రాష్ట్ర మాజీ మిషన్ భగీరథ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్

క్రైమ్ కౌంటర్ న్యూస్ ప్రతినిధి రంగారెడ్డి జిల్లా: -

రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం అంతారం గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన గుండె సమస్యతో బాధపడుంతున్న ఆంజనేయులు గౌడ్ అనే కుమారుడు 11 నెలల అబ్బాయి గుండె ఆపరేషన్ కి తెలంగాణ రాష్ట్ర మాజీ మిషన్ భగీరథ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా 25000 రూపాయలు అబ్బాయి తండ్రి ఆంజనేయులు గౌడ్ కి చెక్కుని మాజీ జెడ్పిటిసి పద్మ నరసింహ బిఆర్ఎస్ పార్టీ తలకొండపల్లి మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ రెడ్డి అందజేశారు ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాములు శ్రీను నరేష్ గౌడ్ వెంకటయ్య శ్రీను లక్ష్మయ్య మహేష్ యాదయ్య పాల్గొన్నారు



## హైదరాబాద్ పర్యటనలో యశోదాబెన్..




ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మాజీ భార్య యశోదా బెన్ హైదరాబాద్‌లో పర్యటిస్తున్నారు. ఆమె తన సోదరుడు, మరో 18 మంది బంధువులతో కలిసి నగరంలోని పలు చారిత్రక ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం చార్మినార్‌లోని భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయం, లాల్‌దర్వాజ సింహవాహిని అమ్మవారి ఆలయాలను కూడా ఆమె దర్శించనున్నారు. గతంలో కూడా యశోదా బెన్ తెలంగాణలోని పలు ఆలయాలను దర్శించి.. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ మాజీ భార్య యశోదా బెన్ ప్రస్తుతం హైదరాబాద్ లో పర్యటిస్తున్నారు. నగరంలోని పలు చారిత్రక ఆలయాలను సందర్శించి.. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈక్రమంలో బుధవారం యశోదా బెన్ చాందాయ్రణగుట్ట ప్రాంతంలో ఉన్న పలు చారిత్రక ఆలయాలను దర్శించుకున్నారు. అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆమె ఒక్కరే హైదరాబాద్ పర్యటనకు రాలేదు. యశోదాబెన్ సోదరుడు అశోక్‌తో పాటు మరో 18 మంది బంధువులతో కలిసి ఆమె ఈ ఆధ్యాత్మిక పర్యటనకు వచ్చారు.యశోదా బెన్ హైదరాబాద్ పర్యటనలో భాగంగా బుధవారం ఆమెతో పాటు మిగతా వారు చాంద్రాయణగుట్టలో ఉన్న పలు ఆలయను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ క్రమంలో నేడు గురువారం చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయంతో పాటు.. లాల్‌దర్వాజ సింహవాహిని అమ్మవార్ల ఆలయాలను కూడా సందర్శించనున్నారు. యశోదా బెన్ బంధువులు కొందరు చాంద్రాయణగుట్ట ఆర్ఎస్ఎస్ మైదానం సమీపంలో నివసిస్తున్నారు. ఆమె వారి ఇంటికి అతిథాగా వచ్చారు. ఈ ఆధ్యాత్మిక యాత్రలో భాగంగా యశోదా బెన్.. బుధవారం పాతబస్తీలోని పలు ప్రసిద్ధ, చారిత్రక ఆలయాల్లో మొక్కులు చెల్లించుకున్నారు. దీనిలో భాగంగా ముందుగా ఆమె శ్రీదేవి దేవాలయంలో అమ్మవారిని దర్శించుకున్నారు. ఆ తర్వాత ఆహె చాంద్రాయణగుట్టపై కొలువైన శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామి దేవాలయానికి వెళ్లారు. ఆ తర్వాత శివాలయాన్ని సందర్శించారు. ఈక్రమంలో చాంద్రాయణగుడ్డలోని జగన్నాథ స్వామి దేవాలయం, న్యూ ఇందిరానగర్‌లోని శ్వేతగంగ ఆలయాలలో ఆమె ప్రత్యేక ప్రార్థనలు చేశారు.అయితే యశోదాబెన్ గతంలో కూడా హైదరాబాద్ వచ్చి.. పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎనిమిదేళ్ల క్రితం అనగా 2017లో ఆమె వికారాబాద్‌లోని రెండు దేవాలయాలను సందర్శించుకున్నారు. ముందుగా నాగదేవత గుడిలో పూజలు నిర్వహించారు. ఆతర్వాత అన్నదానం కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆమె సంతోషిమాత ఆలయాన్ని సందర్శించి, అమ్మవారికి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయానికి ఆమె గోమాతను కానుకగా ఇచ్చారు. యశోదాబెన్ వచ్చాని తెలిసి బీజేపీ కార్యకర్తలు పెద్ద ఎత్తున అక్కడకు చేరుకున్నారు. ఆమె వారితో కాసేపు మాట్లాడారు.

## జీరో కరెంట్ బిల్లు కోసం మీటర్ మార్చాడు..




వనపర్తి జిల్లా కడుకుంట్ల గ్రామానికి చెందిన వెంకటేష్ అనే నిరుపేద కూలీకి విద్యుత్ శాఖ భారీ షాక్ ఇచ్చింది. తెలంగాణ ప్రభుత్వ గృహజ్యోతి పథకం కింద ఉచిత విద్యుత్ కోసం ఆయన తనకున్న పాత బకాయి రూ.813 చెల్లించి, కొత్త మీటర్ అమర్చుకున్నారు. ఇకపై బిల్లు సున్నా వస్తుందని ఆశించగా, నెల తిరిగేసరికి ఏకంగా రూ.7,122 బిల్లు రావడంతో ఆయన దిగ్భ్రాంతికి గురయ్యారు. రెండు గదులున్న చిన్న ఇంట్లో ఇంత పెద్ద మొత్తంలో బిల్లు రావడంపై అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని బాధితుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెక్కాడితే గానీ డొక్కాడని తమకు ఈ భారం భరించలేమని.. వెంటనే స్పందించి న్యాయం చేయాలని ఆయన వేడుకుంటున్నారు. ఉచిత విద్యుత్ పథకానికి అర్హుడైన ఒక నిరుపేద కూలీకి, కొత్త మీటర్ అమర్చిన తర్వాత ఏకంగా ఏడు వేల రూపాయలకు పైగా బిల్లు వచ్చింది. వనపర్తి జిల్లా కడుకుంట్ల గ్రామానికి చెందిన వెంకటేష్ ఒక సామాన్య కూలీ. భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి ఒక చిన్న రెండు గదుల ఇంట్లో నివసిస్తూ.. రెక్కాడితే గానీ డొక్కాడని స్థితిలో జీవనం సాగిస్తున్నాడు. నెలకు రెండు వందల రూపాయల లోపే కరెంటు బిల్లు వచ్చే ఆ చిన్న ఇంటికి, తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహజ్యోతి పథకం ఒక ఆశాదీపంలా కనిపించింది. నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందుతుందని తెలిసి ఆయన సంతోషించాడు.అయితే.. గతంలో 813 రూపాయల బకాయి ఉండటంతో ఆయనకు ఈ పథకం వర్తించలేదు. దీనిపై అధికారులను సంప్రదించగా.. పాత బకాయి చెల్లించి కొత్త మీటర్ బిగించుకుంటే ఉచిత విద్యుత్ అందుతుందని వారు సూచించారు. అప్పు చేసి మరీ ఆ బకాయి కట్టి, కొత్త మీటర్ అమర్చుకున్నాడు. కానీ, ఆ కొత్త మీటర్ వెంకటేష్ జీవితంలో పెద్ద ఆందోళనను నింపింది. నెల తిరిగేసరికి సున్నా బిల్లు వస్తుందని ఆశిస్తే.. ఏకంగా 7,122 రూపాయల బిల్లు చేతికి వచ్చింది. వెంకటేష్ ఎదుర్కొంటున్న ఈ సమస్య కేవలం ఒక్కరిది మాత్రమే కాదు. రాష్ట్రవ్యాప్తంగా గృహజ్యోతి పథకం అమలులో ఇలాంటి సాంకేతిక లోపాలు ఎందరో సామాన్యులను బెంబేలెత్తిస్తున్నాయి. సాధారణంగా పాత మీటర్ తీసి కొత్త మీటర్ బిగించే సమయంలో.. పాత మీటర్ లోని చివరి రీడింగ్, కొత్త మీటర్ లోని ప్రారంభ రీడింగ్ ను అధికారులు సరిగ్గా నమోదు చేయాలి. ఈ క్రమంలో కంప్యూటర్ లో డేటా నమోదు చేసేటప్పుడు జరిగే చిన్న పొరపాట్లు అసాధారణమైన బిల్లులకు దారితీస్తాయి. వెంకటేష్ విషయంలో కూడా మీటర్ మార్చిడి సమయంలో జరిగిన పొరపాటే ఇంత పెద్ద మొత్తానికి కారణమని భావించవచ్చు. రెండు గదులున్న ఇంట్లో ఏడు వేల రూపాయల విద్యుత్ వాడకం అనేది అసాధ్యం.ఇంత పెద్ద మొత్తంలో బిల్లు వచ్చినప్పుడు విద్యుత్ శాఖ అధికారులు వెంటనే స్పందించి క్షేత్రస్థాయిలో తనిఖీ చేయాలి. కానీ... వెంకటేష్ ఫిర్యాదు చేసినా 'చూస్తాం.. చేస్తాం' అంటూ కాలయాపన చేయడం గమనార్హం. ఒక వేళ.. మీటర్ లో లోపం ఉందని అనుమానం ఉంటే.. నిర్ణీత రుసుము చెల్లించి మీటర్ పరీక్ష కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. స్థానిక అసిస్టెంట్ ఇంజనీర్ లేదా సబ్ డివిజనల్ ఇంజనీర్ కు లిఖితపూర్వక ఫిర్యాదు ఇవ్వాలి. క్షేత్రస్థాయి అధికారులు స్పందించకుంటే జిల్లా కేంద్రంలోని విద్యుత్ వినియోగదారుల ఫిర్యాదుల విభాగాన్ని ఆశ్రయించవచ్చు. ప్రభుత్వం ఇచ్చే 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ప్రయోజనం పొందాలంటే మీటర్ లో ఎటువంటి బకాయిలు ఉండకూడదు. అలాగే రేషన్ కార్డు, ఆధార్ కార్డు అనుసంధానం తప్పనిసరి. టెక్నికల్ లోపాల వల్ల బిల్లులు ఎక్కువగా వస్తే.. వెంటనే సంబంధిత కార్యాలయంలో ఫిర్యాదు చేసి వాటిని సరిచేయించుకోవాలి. లేదంటే ఆ బిల్లు కట్టలేదన్న కారణంతో పథకం రద్దయ్యే ప్రమాదం ఉంటుంది.

## బీటెక్ చేస్తే మొదట్లోనే రూ.25 లక్షల ప్యాకేజీ..





2025లో ఇంజనీరింగ్ డిగ్రీ పూర్తి చేసిన యువతకు ఐటీ రంగంలో స్థిరపడేందుకు ఇన్ఫోసిస్ గొప్ప వేదికను సిద్ధం చేసింది. ఈ ప్రత్యేక నియామకాల్లో ప్రతిభే ప్రాతిపదికగా భారీ ప్యాకేజీలు అందుతున్నాయి. అత్యున్నత నైపుణ్యం ఉన్నవారికి 'స్పెషలిస్ట్ ప్రోగ్రామర్ ఎల్ 3' కింద 21 లక్షల రూపాయల వార్షిక వేతనం లభిస్తుంది. అలాగే ఎల్ 2 హోదాకు 16 లక్షలు, ఎల్ 1 కు 10 లక్షల జీతంతో పాటు లక్ష రూపాయల బోనస్ ఇస్తున్నారు. ఇక డిజిటల్ స్పెషలిస్ట్ ఇంజనీర్‌గా ఎంపికైతే 6.25 లక్షల జీతం, 75 వేల రూపాయల బోనస్ లభిస్తుంది. సాఫ్ట్‌వేర్ రంగంలో అడుగుపెట్టాలనుకునే విద్యార్థులకు ఇది నిజంగా ఒక వరమే. ప్రముఖ ఐటీ దిగ్గజ సంస్థ ఇన్ఫోసిస్ తన 2025వ సంవత్సరపు విద్యాసంవత్సరం పూర్తి చేసుకునే విద్యార్థుల కోసం భారీ స్థాయిలో నియామక ప్రక్రియను ప్రారంభించింది. ప్రపంచవ్యాప్తంగా సాఫ్ట్‌వేర్ రంగంలో అత్యంత ఆదరణ పొందిన ఈ సంస్థలో ఉద్యోగం సాధించడం ప్రతి ఇంజనీరింగ్ విద్యార్థి కల. ప్రస్తుతం కొనసాగుతున్న ఈ నియామక ప్రక్రియ ద్వారా ప్రతిభావంతులైన యువతను ఆకర్షణీయమైన వేతనాలతో ఆహ్వానిస్తోంది. ఈ నియామకాల్లో ఎంపికైన వారికి వారి ప్రతిభ , నైపుణ్యం ఆధారంగా వివిధ స్థాయిలలో వేతనాలు అందనున్నాయి.స్పెషలిస్ట్ ప్రోగ్రామర్ ఎల్ 3 పోస్టులతో... ఏకంగా 21 లక్షల రూపాయల వార్షిక వేతనాన్ని అందుకోవచ్చు. దీనితో పాటు సంస్థ ఇచ్చే ప్రపంచ స్థాయి శిక్షణ ఆ అభ్యర్థి కెరీర్‌ను మరో స్థాయికి తీసుకెళ్తుంది. అలాగే ఎల్ 2 స్థాయికి ఎంపికైతే 16 లక్షల రూపాయల జీతం అందుకోవచ్చు. మరోవైపు.. స్పెషలిస్ట్ ప్రోగ్రామర్ ఎల్ 1 పోస్టులకు.. 10 లక్షల రూపాయల వేతనంతో పాటు విధుల్లో చేరిన వెంటనే లక్ష రూపాయల బోనస్ ఇవ్వనున్నారు. ఇక డిజిటల్ స్పెషలిస్ట్ ఇంజనీర్‌గా ఎంపికైన వారికి 6.25 లక్షల రూపాయల ప్యాకేజీతో పాటు 75 వేల రూపాయల జాయినింగ్ బోనస్ అందుతుంది. ఈ వేతనాలు శిక్షణ కాలం పూర్తయ్యాక అభ్యర్థుల నైపుణ్యాల ఆధారంగా మరింత పెరిగే అవకాశం ఉంటుంది.ఈ భారీ రిక్రూట్‌మెంట్ ప్రక్రియలో పాల్గొనాలనుకునే అభ్యర్థులు ఈ విద్యార్హతలు కలిగి ఉండాలి. బీఈ, బీటెక్, ఎంఈ, ఎంటెక్, ఎంసీఏ లేదా ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ పూర్తి చేసిన వారు అర్హులు. కేవలం 2025లో తమ విద్యను పూర్తి చేసిన అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవడానికి వీలుంటుంది. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలంటే ఇక్కడ ఇచ్చిన లింక్ ద్వారా చేసుకోవచ్చు.

ఇన్ఫోసిస్ నియామక ప్రక్రియ సాధారణంగా మూడు దశల్లో జరుగుతుంది. దీనిపై అభ్యర్థులకు అవగాహన ఉండటం చాలా అవసరం.

1. ఆన్‌లైన్ అసెస్‌మెంట్ టెస్ట్: తొలుత దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఆన్‌లైన్ పరీక్ష నిర్వహిస్తారు. ఇందులో లాజికల్ రీజనింగ్, అర్థమెటిక్ ఎబిలిటీ, ప్రోగ్రామింగ్ నైపుణ్యాలను పరీక్షిస్తారు. ముఖ్యంగా స్పెషలిస్ట్ ప్రోగ్రామర్ వంటి ఉన్నత స్థాయి పోస్టులకు కోడింగ్ రౌండ్ చాలా కఠినంగా ఉండే అవకాశం ఉంది.
2. టెక్నికల్ ఇంటర్వ్యూ: రాత పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి టెక్నికల్ ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. ఇందులో అభ్యర్థి ఎంచుకున్న ప్రోగ్రామింగ్ భాషలు (జావా, పైథాన్ లేదా సిం౦), డేటా స్ట్రక్చర్స్ , అల్గారిథమ్స్ గురించి లోతైన ప్రశ్నలు అడుగుతారు. మీరు చేసిన ప్రాజెక్టుల గురించి వివరించాల్సి ఉంటుంది.
3. హెచ్ ఆర్ ఇంటర్వ్యూ ఉంటుంది. దీనిలో సక్సెస్ సాధించిన వారు ఆయా పోస్టులకు ఎంపికవుతారు.

## 2025లో ఎంతమందంటే..



తెలంగాణలో అవినీతి తిమింగలాల వేటలో ఏసీబీ అధికారులు ఈ ఏడాది దూకుడు పెంచారు. 2025లో ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 220 కంటే ఎక్కువ కేసులు నమోదు కాగా.. సుమారు 190 మందికి పైగా ప్రభుత్వ ఉద్యోగులను అధికారులు అరెస్ట్ చేశారు. ముఖ్యంగా ఇరిగేషన్, రెవెన్యూ శాఖల్లోనే లంచం కేసులు ఎక్కువగా వెలుగుచూశాయి. ఆదాయానికి మించిన ఆస్తుల కేసుల్లో దాదాపు రూ. 58 కోట్ల విలువైన డాక్యుమెంట్లను సీజ్ చేయగా.. వీటి బహిరంగ మార్కెట్ విలువ రూ. 500 కోట్లకు పైనే ఉంటుందని అంచనా. లంచం అడిగే అధికారుల సమాచారాన్ని 1064 టోల్ ఫ్రీ నంబర్‌కు తెలియజేయాలని అధికారులు ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు. తెలంగాణలో అవినీతికి వ్యతిరేకంగా రాష్ట్ర అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) తన పోరాటాన్ని ఉధృతం చేసింది. ప్రభుత్వ కార్యాలయాల్లో సామాన్యులను ఇబ్బంది పెడుతూ లంచాలకు అలవాటు పడిన అధికారుల భరతం పట్టడంలో అధికారులు ఈ ఏడాది సరికొత్త రికార్డులను సృష్టించారు. 2025 సంవత్సరం ప్రారంభం నుండి ఇప్పటివరకు తెలంగాణ వ్యాప్తంగా ఏసీబీ అధికారులు 220 కంటే ఎక్కువ కేసులు నమోదు చేశారు. ఇది గత ఏడాదితో పోలిస్తే భారీ పెరుగుదల.ఈ కేసులలో భాగంగా దాదాపు 150 మందికి పైగా ప్రభుత్వ ఉద్యోగులను అధికారులు కస్టడీలోకి తీసుకున్నారు. పట్టుబడిన కేసులలో అధిక శాతం లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా దొరికిపోయినవే. 2024లో మొత్తం 152 కేసులు నమోదు కాగా.. ఈ ఏడాది ఆ సంఖ్య ఇప్పటికే 220 దాటిపోయింది. అంటే దాదాపు 100 కేసులు అదనంగా నమోదయ్యాయి. ఈ ఏడాది దాడులలో కొన్ని శాఖలకు చెందిన అధికారులు అక్రమ సంపాదనలో రికార్డులు సృష్టించారు. నీటి పారుదల శాఖ, రెవెన్యూ విభాగాల్లో అత్యధికంగా లంచం కేసులు వెలుగుచూశాయి. భూముల వ్యవహారాలు, ప్రాజెక్టుల బిల్లుల క్లియరెన్స్ కోసం సామాన్యులను వేధించిన అధికారులు ఏసీబీ వలలో చిక్కారు. ఇటీవల రవాణా శాఖలో జరిగిన సోదాలు రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించాయి. ఒకే అధికారి వద్ద వందల కోట్ల అక్రమాస్తులు బయటపడటం అధికారులనే విస్మయానికి గురిచేసింది. కేవలం లంచం మాత్రమే కాకుండా.. అక్రమంగా కోట్లు కూడబెట్టిన 17 మంది పైగా ఉన్నతాధికారులపై ఆదాయానికి మించిన ఆస్తుల కేసులు నమోదయ్యాయి. వీరి నుండి కేజీల కొద్దీ బంగారం, భారీగా నగదు, స్థిర ఆస్తులను ఏసీబీ సీజ్ చేసింది.అవినీతి రహిత తెలంగాణే లక్ష్యంగా ప్రభుత్వం ఏసీబీకి పూర్తి స్వేచ్ఛను ఇచ్చింది. ఫిర్యాదులను స్వీకరించడానికి వాట్సాప్,టోల్ ఫ్రీ నంబర్లను అధికారులు అందుబాటులోకి తెచ్చారు. దీనివల్ల బాధితులు భయం లేకుండా ముందుకు వస్తున్నారు. లంచగొండి అధికారులను అరెస్ట్ చేయడమే కాకుండా.. వారిని సర్వీసు నుండి తొలగించేలా.. వారి ఆస్తులను జప్తు చేసేలా చట్టపరమైన చర్యలను వేగవంతం చేశారు.ఏదైనా ప్రభుత్వ పని కోసం అధికారులు డబ్బులు డిమాండ్ చేస్తే వెంటనే ఏసీబీని సంప్రదించాలని అధికారులు సూచిస్తున్నారు. లంచం ఇవ్వడం కూడా నేరమేనని.. అందుకే వ్యవస్థను ప్రక్షాళన చేయడంలో ప్రజలు సహకరించాలని కోరుతున్నారు. ఏసీబీ చేపట్టిన ఈ మెరుపు దాడులతో ప్రస్తుతం ప్రభుత్వ కార్యాలయాల్లోని అవినీతి అధికారుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి.

## తెలంగాణలో ఆ ప్రభుత్వ ఉద్యోగాలు..




రాష్ట్ర వైద్య ఆరోగ్య సేవల నియామక బోర్డు చేపట్టిన ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్-2 ఉద్యోగాల భర్తీలో ఫేక్ సర్టిఫికెట్ల వ్యవహారం పెను దుమారం రేపుతోంది. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు కేటాయించిన 20 శాతం వెయిటేజీ మార్కులను కొందరు అనర్హులు అక్రమ మార్గంలో పొందినట్లు ఆరోపణలు వస్తున్నాయి. దీనివల్ల రాత పరీక్షలో ప్రతిభ చూపిన అర్హులైన అభ్యర్థులకు తీరని అన్యాయం జరుగుతోంది. ఈ అక్రమాలపై ఉన్నతాధికారులు లోతైన విచారణ జరిపి, నకిలీ పత్రాలు సమర్పించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య సేవల నియామక బోర్డు చేపట్టిన ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్-2 ఉద్యోగాల భర్తీ ప్రక్రియ ఇప్పుడు తీవ్ర దుమారం రేపుతోంది. ముఖ్యంగా ఫేక్ ఎక్స్‌పీరియన్స్ సర్టిఫికెట్ల ద్వారా అనర్హులు వెయిటేజీ మార్కులు పొంది, అర్హులైన అభ్యర్థుల అవకాశాలను దెబ్బతీశారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నిబంధనలను తుంగలో తొక్కి.. తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో ప్రభుత్వ ఉద్యోగాలను కొల్లగొట్టే ప్రయత్నం జరుగుతోందని అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.గతేడాది సెప్టెంబర్ 11న 1,284 ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్-2 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. మొత్తం 100 మార్కులలో 80 మార్కులు రాత పరీక్షకు.. మిగిలిన 20 మార్కులు ప్రభుత్వ సర్వీసులో ఉన్న వారికి వెయిటేజీగా కేటాయించారు. గిరిజన ప్రాంతాల్లో పనిచేసే వారికి ప్రతి ఆరు నెలలకు 2.5 పాయింట్లు, ఇతర ప్రాంతాల్లో పనిచేసే వారికి 2 పాయింట్ల చొప్పున గరిష్టంగా 20 పాయింట్లు ఇస్తారు. అభ్యర్థి గతంలో ఖచ్చితంగా 'ల్యాబ్ టెక్నీషియన్' హోదాలోనే ప్రభుత్వ ఆస్పత్రులు లేదా విభాగాల్లో పనిచేసి ఉండాలి. వేరే ఇతర హోదాల్లో పనిచేసిన వారికి ఈ వెయిటేజీ వర్తించదు. ఈ నెల 20 నుండి 22 వరకు జరిగిన కౌన్సెలింగ్ ప్రక్రియలో అసలు అక్రమాలు బయటపడ్డాయి. ఏడు జోన్ల పరిధిలో (చార్మినార్, జోగులాంబ, యాదాద్రి, రాజన్న, భద్రాద్రి, బాసర, కాళేశ్వరం) అభ్యర్థుల జాబితాను పరిశీలించిన బాధితులు దిగ్భ్రాంతికి గురయ్యారు. ప్రభుత్వ వొకేషనల్ జూనియర్ కళాశాలల్లో పనిచేసే కాంట్రాక్టు లెక్చరర్లు, ఆర్టీపీసీఆర్ సైంటిస్టులు, టీ-హబ్ మేనేజర్లు, ల్యాబ్ అటెండెంట్లు సైతం ల్యాబ్ టెక్నీషియన్లుగా తప్పుడు సర్వీస్ సర్టిఫికెట్లు సృష్టించినట్లు ఆరోపణలు వస్తున్నాయి.నోటిఫికేషన్‌లో సూచించిన ఫార్మాట్‌లో ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాల్సిన బాధ్యత ఉన్నత అధికారులదే. అయితే.. క్షేత్రస్థాయిలో వాస్తవాలను పరిశీలించకుండానే కొందరు అధికారులు ఈ ఫేక్ సర్టిఫికెట్లను జారీ చేశారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.కోవిడ్ సమయంలో తాత్కాలికంగా పనిచేసిన వారు కూడా నిబంధనలకు విరుద్ధంగా సర్వీస్ మార్కులు పొందినట్లు అభ్యర్థులు ఆధారాలతో సహా నియామక బోర్డుకు ఫిర్యాదు చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, వెంటనే జాబితాను ప్రక్షాళన చేసి అర్హులకు మాత్రమే నియామక పత్రాలు అందజేయాలని అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు.

## ఎట్టకేలకు.. ఏళ్ల నాటి కల సాకారం..




శంకర్ పల్లి రైల్వే స్టేషన్‌లో మూడు ఎక్స్‌ప్రెస్ రైళ్ల నిలుపుదలను(హాల్టింగ్) చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి ప్రారంభించారు. రైల్వే మంత్రికి చేసిన విజ్ఞప్తి మేరకు పర్భని ఎక్స్‌ప్రెస్‌తో పాటు మరో రెండు రైళ్లకు ఇక్కడ హాల్టింగ్ కల్పించారు. ఇది స్థానిక ఐటీ ఉద్యోగులు, విద్యార్థులకు ఎంతో మేలు చేస్తుందని ఎంపీ పేర్కొన్నారు. మరోవైపు.. సంక్రాంతి పండుగ రద్దీని దృష్టిలో ఉంచుకుని దక్షిణ మధ్య రైల్వే హైటెక్ సిటీ స్టేషన్‌లో కూడా పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లను నిలపాలని నిర్ణయించింది. ఐటీ కారిడార్ వాసులు సికింద్రాబాద్ వెళ్లే అవసరం లేకుండా నేరుగా ఇక్కడే రైలు ఎక్కవచ్చు. వికారాబాద్ జిల్లా శంకర్ పల్లి పరిసర ప్రాంతాల ప్రజల దశాబ్దాల కల నెరవేరింది. ప్రయాణికుల విన్నపాలను మన్నిస్తూ దక్షిణ మధ్య రైల్వే అధికారులు శంకర్ పల్లి రైల్వే స్టేషన్‌లో మూడు ఎక్స్‌ప్రెస్ రైళ్లను నిలపాలని నిర్ణయించారు. గురువారం రాత్రి చేవెళ్ల పార్లమెంట్ సభ్యుడు కొండా విశ్వేశ్వర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నంతో కలిసి పర్భని ఎక్స్‌ప్రెస్ నిలుపుదలను జెండా ఊపి అధికారికంగా ప్రారంభించారు.గతంలో కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ శంకర్ పల్లి సందర్శించినప్పుడు స్థానిక ప్రజలు, ప్రజా ప్రతినిధులు ఇక్కడ ఎక్స్‌ప్రెస్ రైళ్లను నిలపాలని విజ్ఞప్తి చేశారు. దీనికి సానుకూలంగా స్పందించిన రైల్వే శాఖ, ప్రయాణికుల రద్దీని పరిగణనలోకి తీసుకుని ఈ సౌకర్యాన్ని కల్పించింది. కేంద్ర ప్రభుత్వం రైల్వే స్టేషన్ల ఆధునీకరణలో భాగంగా శంకర్ పల్లి స్టేషన్‌కు కూడా నిధులు కేటాయించింది. స్టేషన్ పరిధిలో అండర్ పాస్‌లు, వంతెనల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ మూడు రైళ్లు ఆగడం వల్ల ఐటీ ఉద్యోగులు, చిరు వ్యాపారులు, విద్యార్థులకు హైదరాబాద్ వెళ్లేందుకు ప్రయాణ సమయం ఆదా అవుతుంది. ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి స్వయంగా అదే రైలులో ప్రయాణించి ప్రయాణికుల సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఇదిలా ఉండగా.. వచ్చే సంక్రాంతి పండుగ రద్దీని దృష్టిలో ఉంచుకుని దక్షిణ మధ్య రైల్వే మరో కీలక నిర్ణయం తీసుకుంది. పండుగకు ఊళ్లకు వెళ్లే ప్రయాణికుల కోసం హైటెక్ సిటీ రైల్వే స్టేషన్‌లో కూడా పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లను నిలపాలని అధికారులు నిర్ణయించారు. మాదాపూర్, గచ్చిబౌలి, కూకట్‌పల్లి పరిసరాల్లో ఉండే వేలాది మంది ఐటీ ఉద్యోగులు సికింద్రాబాద్ లేదా నాంపల్లి వరకు వెళ్లకుండా నేరుగా హైటెక్ సిటీ నుండే రైలు ఎక్కే వీలుంటుంది.సంక్రాంతి సీజన్‌లో నడిపే ప్రత్యేక రైళ్లకు కూడా హైటెక్ సిటీలో హాల్టింగ్ కల్పించడం వల్ల నగరంలోని ట్రాఫిక్ ఇబ్బందులు తగ్గుతాయి. పండుగ రద్దీ దృష్ట్యా హైటెక్ సిటీ స్టేషన్‌లో అదనపు బుకింగ్ కౌంటర్లు, తాగునీరు, భద్రతా ఏర్పాట్లను రైల్వే శాఖ పర్యవేక్షిస్తోంది. మొత్తంగా తెలంగాణలోని కీలకమైన స్టేషన్లలో రైళ్ల నిలుపుదల(హాల్టింగ్) పెరగడం వల్ల సామాన్య ప్రయాణికులకు రవాణా వ్యవస్థ మరింత చేరువవుతోంది.




# వరల్డ్ కప్ 2026 టీమ్ ఎంపికలో తప్పిదం..!



టీ20 వరల్డ్ కప్ 2026కు భారత జట్టు ఎంపికపై దుమారం రేగింది. శుభ్‌మన్ గిల్‌ను పక్కనపెట్టడం.. ఇషాన్ కిషన్‌ను జట్టులోకి తీసుకోవడంపై బీసీసీఐ నిర్ణయాన్ని సమర్థిస్తూ కొందరు.. వ్యతిరేకిస్తూ మరికొందరు తమ అభిప్రాయాలను వెల్లడిస్తున్నారు. ఈ క్రమంలో మాజీ టీమిండియా కెప్టెన్ దిలీప్ వెంగ్‌సర్కార్ కూడా స్పందించాడు. యశస్వి జైస్వాల్‌ను తీసుకోకపోవడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశాడు. జైస్వాల్‌ను ఎందుకు తీసుకోలేదని ప్రశ్నిస్తూ.. అతని ప్రతిభను కొనియాడాడు. మ్యాచ్ విన్నర్‌ను జట్టు నుంచి పదే పదే తప్పిస్తే ఆత్మవిశ్వాసం దెబ్బతింటుందని చెప్పాడు. టీ20 వరల్డ్ కప్ 2026 కోసం భారత జట్టును బీసీసీఐ ఇటీవల ప్రకటించిన విషయం తెలిసిందే. వరల్డ్ కప్ జట్టులో యంగ్ ప్లేయర్ శుభ్‌మన్ గిల్‌ను పూర్తిగా జట్టుకు దూరం పెట్టింది బీసీసీఐ. ఇప్పటివరకు వైస్ కెప్టెన్‌గా కొనసాగిన గిల్‌ను ఆ బాధ్యత నుంచి తప్పించింది. అయితే వరల్డ్ కప్ టీమ్‌లో శుభ్‌మన్ గిల్‌ను ఎంపిక చేయకపోవడంపై పెద్ద దుమారమే చెలరేగింది. అయితే అతడి స్థానంలో సంజు శాంసన్, ఇషాన్ కిషన్‌ను జట్టులోకి తీసుకున్నారు. దీనిపై కూడా భిన్నాభిప్రాయాలు వచ్చాయి. మాజీ క్రికెటర్లతో పాటు అనేక మంది క్రికెట్ అభిమానులు.. బీసీసీఐని సమర్థిస్తూ, వ్యతిరేకిస్తూ తమ అభిప్రాయాలను వెల్లడిస్తున్నారు. తాజాగా ఈ విషయంపై టీమిండియా మాజీ కెప్టెన్ దిలీప్ వెంగ్‌సర్కార్ కూడా స్పందించారు. జట్టులోకి యంగ్ ప్లేయర్ యశ్వస్వి జైస్వాల్‌ను ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు. వరల్డ్ కప్ జట్టు ఎంపికను దిలీప్ వెంగ్‌సర్కార్ తప్పుపట్టారు. యువ ఆటగాడు యశస్వి జైస్వాల్ తప్పు లేకుండానే అతడిని పదే పదే జట్టు నుంచి తప్పించడం దురదృష్టకరం అని అన్నాడు. జైస్వాల్ అన్ని ఫార్మాట్లలో అద్భుతమైన ప్రదర్శన చేస్తున్నాడని దిలీప్ వెంగ్‌సర్కార్ పేర్కొన్నాడు. కాగా, జట్టులోకి రావడానికి అతడు ఇంకా ఏం చేయాలో నాకు తెలియదని అసహనం వ్యక్తం చేశాడు. మ్యాచ్ విన్నర్‌ను ఎవరూ జట్టు నుంచి తప్పించకూడదని హితవు పలికారు దిలీప్ వెంగ్‌సర్కార్."2026లో జరగబోయే టీ20 వరల్డ్ కప్‌కు ఎంపికైనవారంతా నైపుణ్యం కలిగిన ప్లేయర్లే. యంగ్ ప్లేయర్ శుభ్‌మన్ గిల్ విషయంలో బీసీసీఐ సెలక్టర్లు తీసుకున్న నిర్ణయాన్ని నేను సమర్థిస్తా. అతడికి బదులు ఎవరిని ఎంచుకుంటారని మీరు అడిగితే నేను యశస్వి జైస్వాల్ పేరు చెబుతా. అతడు క్లాస్ పెర్ఫార్మర్ అని.. పదే పదే నిరూపించుకున్నాడు. ఎన్నోసార్లు జట్టుకు మంచి ఆరంభాలు అందించాడు. అయితే ఒక ఫార్మాట్‌లో వరుసగా జట్టు నుంచి తప్పిస్తే.. ఏ ఆటగాడైనా ఇక తన అవసరం జట్టుకు లేదేమోనని భావించి ఆత్మవిశ్వాసాన్ని కోల్పోతాడు. క్రీడల్లో.. ముఖ్యంగా క్రికెట్‌లో ఆత్మవిశ్వాసం అనేది చాలా ముఖ్యం" అని ఘాటుగామే దిలీప్ వెంగ్‌సర్కార్ తన అభిప్రాయాన్ని వెల్లడించాడు. యశస్వి జైస్వాల్ భారత జట్టు తరఫున 2024 జులైలో చివరి టీ20 మ్యాచ్ ఆడాడు. తర్వాత జైస్వాల్ టెస్టులపై ఎక్కువ దృష్టి సారించేలా జట్టు యాజమాన్యం ఎంకరేజ్ చేసింది. జనవరి 11 నుంచి కివీస్‌తో భారత్ మూడు వన్డేల సిరీస్‌కు జైస్వాల్ ఎంపికైనా.. అతడిని బెంచ్‌కే పరిమితం చేస్తారనే అభిప్రాయం వినిపిస్తోంది. వన్డే కెప్టెన్ శుభ్‌మన్ గిల్ రోహిత్ శర్మతో కలిసి ఓపెనింగ్ చేస్తాడు. దీంతో జైస్వాల్ బెంచ్‌లోమే ఉండాటని విశ్లేషకులు అంటున్నారు.




# ఇంగ్లండ్ నెక్స్ట్ కోచ్‌గా రవిశాస్త్రి పేరు..





మొదలైంది. బాజ్ బాల్ వ్యూహంపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఆస్ట్రేలియాను వారి గడ్డపై ఎలా ఓడించాలో తెలిసిన రవిశాస్త్రిని తదుపరి హెడ్ కోచ్‌గా నియమించాలని మాజీ స్పిన్నర్ మాంటీ పనేసర్ సంచలన వ్యాఖ్యలు చేశాడు. గతంలో రవిశాస్త్రి కోచ్‌గా ఉన్నప్పుడే భారత్ ఆస్ట్రేలియాను వాళ్ల సొంత గడ్డ మీదే రెండుసార్లు ఓడించింది. అందుకే పనేసర్ రవిశాస్త్రి పేరు సూచించాడు. యాషెస్ సిరీస్‌లో మరో రెండు టెస్టులు మిగిలుండగానే ఇంగ్లండ్ ఘోర పరాభవాన్ని మూటగట్టుకుంది. 0 - 3తో సిరీస్ ఓడిపోవడంతో హెడ్ కోచ్ బ్రెండెన్ మెక్‌కలమ్ భవిష్యత్‌పై ఇప్పటికే తీవ్ర చర్చ మొదలైంది. కేవలం 11 రోజుల్లోనే సిరీస్‌ను కోల్పోవడంతో బాజ్ బాల్ వ్యూహంపై కూడా ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. ఓవర్ కాన్ఫిడెంట్‌తో ఆస్ట్రేలియా గడ్డపై అడుగుపెట్టిన ఇంగ్లండ్ దారుణ పరాజయం పాలవడంతో కొత్త కోచ్ కావాలన్న వాదన ఎక్కువగా వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో ఇంగ్లండ్ మాజీ స్పిన్నర్ మాంటీ పనేసర్ నెక్స్ట్ హెడ్ కోచ్‌గా భారత మాజీ జట్టు కోచ్ రవిశాస్త్రిని నియమించాలంటూ సంచలన వ్యాఖ్యలు చేశాడు. ఆస్ట్రేలియాను వారి స్వంత గడ్డపై ఎలా ఓడించాలో తెలిసిన వ్యక్తి రవిశాస్త్రే అని పనేసర్ అభిప్రాయపడ్డాడు. 2022లో రాబ్ కీ నిర్ణయంతో ఇంగ్లండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) మెక్‌కల్లమ్‌ను హెడ్ కోచ్‌గా నియమించింది. అప్పట్లో యాషెస్‌లో 4-0 ఓటమి తర్వాత బాధ్యతలు చేపట్టిన మెక్‌కల్లమ్ ఉ స్టోక్స్ జోడీ ఇంగ్లండ్ టెస్ట్ క్రికెట్‌కు కొత్త ఉత్సాహం తీసుకొచ్చింది. మొదటి 11 మ్యాచ్‌లలో 10 విజయాలు సాధించి అందరి దృష్టిని ఆకర్షించారు. కానీ ఆ తర్వాత ఇంగ్లండ్ ప్రదర్శన క్రమంగా పడిపోయింది. ఆస్ట్రేలియా, భారత్‌లతో జరిగిన ప్రతిష్ఠాత్మక ఐదు టెస్టుల సిరీస్‌లలో ఒక్కదాన్ని కూడా గెలవలేకపోయింది. గత 33 మ్యాచ్‌ల్లో 16 ఓటములు ఎదుర్కొన్న ఇంగ్లండ్, ప్రస్తుత యాషెస్ సిరీస్‌లో 0-3తో వెనుకబడి నిలిచింది.తన యూట్యూబ్ ఛానెల్‌లో జర్నలిస్టు రవి బిష్త్‌తో మాట్లాడిన మాంటీ పనేసర్ "ఆస్ట్రేలియాను ఎలా ఓడించాలో నిజంగా ఎవరికీ తెలుసు? వారి బలహీనతలను మానసికంగా, శారీరకంగా, వ్యూహాత్మకంగా ఎలా ఉపయోగించుకోవాలో తెలిసిన వ్యక్తి కావాలి. నా అభిప్రాయంలో ఇంగ్లండ్‌కు తదుపరి హెడ్ కోచ్‌గా రవిశాస్త్రే సరైన వ్యక్తి" అని వ్యాఖ్యానించాడు.రవిశాస్త్రి కోచ్‌గా ఉన్న సమయంలో భారత్ ఆస్ట్రేలియాను రెండు సార్లు వారి గడ్డపై ఓడించింది. 2018-19 బోర్డర్-గావస్కర్ ట్రోఫీలో భారత్ తొలి సిరీస్ విజయం సాధించింది. ఆ తర్వాత 2020-21లో అడిలైడ్ టెస్టులో 36 పరుగులకే ఆలౌటైనప్పటికీ, గాయాలతో నిండిన జట్టుతో తిరిగి సిరీస్‌ను కైవసం చేసుకోవడం క్రికెట్ చరిత్రలో చిరస్థాయిగా నిలిచింది.

# యంగ్ స్పిన్నర్‌పై బీసీసీఐకి ఫిర్యాదు!

ఐపీఎల్ 2026కు ముందు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) జట్టుకు వరుస షాక్‌లు తగులుతున్నాయి. యంగ్ బౌలర్ యశ్ దయాల్ లైంగిక వేధింపుల కేసులో చిక్కుకోగా.. తాజాగా 18 ఏళ్ల బౌలర్ సాత్విక్ దేశ్వాల్‌పై ఫోర్జరీ ఆరోపణలు వచ్చాయి. పుదుచ్చేరి జట్టు తరఫున ఆడేందుకు సాత్విక్ దేశ్వాల్ తప్పుడు డాక్యుమెంట్లు సమర్పించాడని బీసీసీఐకి ఫిర్యాదు వెళ్లింది. ఒకవేళ ఈ ఆరోపణలు రుజువైతే.. సాత్విక్‌పై నిషేధం పడే అవకాశం ఉంది. దీంతో అతడు ఆర్సీబీకి ఆడకపోవచ్చు. ఐపీఎల్ 2026 ముంగిట్లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) జట్టుకు వరుస ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. ఇప్పటికే లైంగిక వేధింపుల కేసులో చిక్కుల్లో పడ్డాడు యంగ్ బౌలర్ యశ్ దయాల్. ఈ కేసులో ముందస్తు బెయిల్ ఇవ్వడానికి జైపూర్ పోక్సో కోర్టు తిరస్కరించింది. మైనర్‌పై అత్యాచారం ఆరోపణలున్న ఈ కేసు తీవ్రమైనదని.. అరెస్టు నుంచి స్టే ఇవ్వడానికి నిరాకరించింది. తాజాగా ఆర్సీబీకి చెందిన 18 ఏళ్ల బౌలర్ సాత్విక్ దేశ్వాల్ చిక్కుల్లో పడ్డాడు. క్రికెట్‌లో అవకాశాల కోసం డాక్యుమెంట్లపై ఫోర్జరీ చేశాడనే ఆరోపణలు వచ్చాయి. ఈ మేరకు బీసీసీఐకి ఫిర్యాదు వెళ్లింది. పుదుచ్చేరి జట్టు తరఫున ఆడుతున్న స్పిన్నర్ సాత్విక్ దేశ్వాల్‌ను ఇటీవల అబుదాబి వేదికగా జరిగిన ఐపీఎల్ 2026 మినీ వేలంలో రూ.30 లక్షల ప్రారంభ ధరకు ఆర్సీబీ కొనుగోలు చేసింది. అయితే ఇతడు పుదుచ్చేరి జట్టు తరఫున ఆడేందుకు.. తప్పుడు డాక్యుమెంట్లు సమర్పించాడని బీసీసీఐ యాంటీ కరప్షన్ యూనిట్ (ఏసీయూ)కు.. పుదుచ్చేరి నేటివ్ క్రికెట్ ప్లేయర్ అసోసియేషన్ ఫిర్యాదు చేసింది. పుదుచ్చేరి జట్టుకు ఆడాలంటే కనీసం సంవత్సర కాలం పాటు అక్కడే నివసించి ఉండాలి. కానీ సాత్విక్ ఆ నిబంధనను ఉల్లంఘించాడనేది ప్రధాన ఆరోపణ.సాత్విక్ దేశ్వాల్ 2025 ఆగస్టు 10 వరకు హర్యానా క్రికెట్ అసోసియేషన్ లీగ్‌లో ఆడాడని.. అలాంటప్పుడు ఆయన పుదుచ్చేరి నివాసిగా ఎలా గుర్తింపు పొందుతారని నేటివ్ క్రికెట్ ప్లేయర్ అసోసియేషన్ ప్రశ్నించింది. ఈ విషయంపై ఇప్పటికే ఫిర్యాదు చేశామని.. నెల గడిచినా బీసీసీఐ ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలిపింది. దీనిపై అసోసియేషన్ అసహనం వ్యక్తం చేసింది. ఈ విషయంపై బీసీసీఐ స్పందించకపోతే మీడియా ముందుకు వెళ్తామని తెగేసి చెప్పింది.మరోవైపు, నేటివ్ క్రికెట్ ప్లేయర్ అసోషియేషన్ చేసిన ఆరోపణలను.. క్రికెట్ అసోసియేషన్ పుదుచ్చేరి (సీఏపీ) మాజీ అధ్యక్షుడు పీ దామోదరన్ ఖండించారు. ఈ వార్తలు పూర్తిగా అసత్యమని కొట్టిపారేశారు. సాత్విక్‌పై వచ్చినవన్నీ తప్పుడు ఆరోపణలని.. కావాలనే బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. ఇలా తప్పుడు ఫిర్యాదులు చేసిన వారిపై రూ.50 కోట్లు పరువు నష్టం దావా వేస్తామని.. దీనికి సంబంధించి తమ అడ్వొకేట్లు ఇప్పటికే సిద్ధంగా ఉన్నారని చెప్పారు. కాగా, సాత్విక్‌పై ఆరోపణలు రుజువైతే.. అతడిపై నిషేధం పడే అవకాశం ఉంది. అదే జరిగితే ఐపీఎల్ 2026లో సాత్విక్ ఆర్సీబీ తరఫున ఆడలేడు. మరి ఈ విషయంలో బీసీసీఐ ఏం నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాలి.




# ఈ ఏడాది 'ఖేల్‌రత్న' ఎవ్వరికీ లేదు..

మేజర్ ధ్యాన్ చంద్ ఖేల్ రత్న అవార్డుకు సంబంధించి 2025 ఏడాదికి గానూ ఎవరూ ఎంపిక కాలేదని తెలుస్తోంది. ఈ మేరకు బుధవారం సమావేశమైన సెలెక్షన్ ప్యానెల్.. సిఫారసు చేసిన ఏ ఒక్క క్రీడాకారుడిపై ఏకాభిప్రాయానికి రాలేనట్లు సమాచారం. అయితే ఇలా ఈ ప్రతిష్టాత్మక పురస్కారం ఎవ్వరికీ దక్కకపోవడం ఖేల్‌రత్న అవార్డు 34 ఏళ్ల చరిత్రలో ఇది మూడోసారి. మరోవైపు, వరుసగా రెండో ఏడాది అర్జున అవార్డుకు కూడా ఏ క్రికెటర్‌ను సిఫారసు చేయకపోవడం గమనార్హం. కాగా, అవార్డుల ఎంపికలో పారదర్శకత లోపిస్తోందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. భారతదేశపు అత్యున్నత క్రీడా పురస్కారం మేజర్ ధ్యాన్ చంద్ ఖేల్ రత్న అవార్డు. అంతర్జాతీయ క్రీడా పోటీలలో అసాధారణమైన ప్రతిభ కనబరిచిన భారత క్రీడాకారులకు ఈ అవార్డు ఇస్తారు. అయితే ఈ ప్రతిష్టాత్మక ఖేల్‌రత్న పురస్కారం 2025కు సంబంధించి ఎవరూ ఎంపిక కాలేదని తెలుస్తోంది. బుధవారం (డిసెంబర్ 24) ఢిల్లీలో సెలెక్షన్ ప్యానెల్ సమావేశం అయిన నేపథ్యంలో హై డ్రామా నడిచింది. క్రీడా పురష్కారాలకు ఎంపిక అయిన క్రీడాకారుల పేర్లు మీడియాకు లీక్ అవడంతో గందరగోళ పరిస్థితి నెలకొంది. అందులో ఈ ఏడాది ఏ క్రీడాకారుడు కూడా ఖేల్‌రత్నకు ఎంపిక కాలేదని సమాచారం. ఇక ఈ ఏడాది అర్జున అవార్డుకు ఏ ఒక్క క్రికెటర్‌ను సిఫారసు చేయకపోవడం గమనార్హం. సెలెక్షన్ ప్యానెల్ సమావేశంలో.. ప్రపంచ కప్ గెలిచిన కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్, స్మృతి మంధాన పేర్లతో పాటు డబుల్ ఒలింపిక్ పతక విజేత, హాకీ క్రీడాకారుడు హార్దిక్ సింగ్ పేర్లను కూడా చర్చకు వచ్చినట్లు సమాచారం. చివరికి ఈ సంవత్సరం ఎవరికీ ఖేల్ రత్న పురస్కారాన్ని ప్రదానం చేయకూడదని కమిటీ ఏకాభిప్రాయానికి వచ్చిందని తెలుస్తోంది. అయితే మేజర్ ధ్యాన్ చంద్ ఖేల్ రత్న అవార్డు 34 ఏళ్ల చరిత్రలో ఇలా ఎవరికీ అవార్డు ఇవ్వకపోవడం ఇది మూడోసారి. 1991లో విశ్వనాథన్ ఆనంద్‌కు మొదటగా ఈ అవార్డు ఇచ్చారు. అప్పటి నుంచి ఒకే పేరుపై ఏకాభిప్రాయం లేకపోవడం వల్ల 2008, 2014లో ఈ అవార్డును ఎవ్వరికీ ఇవ్వలేదు. ఇక్కడ మరో ఆశ్చర్యకరమైన పరిణామం ఏంటంటే.. వరుసగా రెండో ఏడాది కూడా ఏ క్రికెటర్‌ను అర్జున అవార్డుకు సిఫారసు చేయలేదు. 2025 నవంబర్‌లో చారిత్రాత్మక ప్రపంచ కప్ విజయం సాధించినప్పటికీ.. హర్మన్‌ప్రీత్ కౌర్ లేదా ఆమె సహచర క్రీడాకారులలో ఎవరినీ కమిటీ ఈ అగ్ర పురస్కారానికి అర్హులుగా గుర్తించకపోవడం గమనార్హం. కాగా, క్రికెటర్లలో.. ఖేల్ రత్న అవార్డును మొదట సచిన్ తెండూల్కర్‌కు (1997-98), ఆ తర్వాత ఎంఎస్ ధోనీ (2007), విరాట్ కోహ్లీ (2018), రోహిత్ శర్మకు (2019) ప్రదానం చేశారు. ఇక భారత మహిళల జట్టు మాజీ కెప్టెన్ మిథాలీ రాజ్ (2021) ఈ గౌరవాన్ని అందుకున్న ఏకైక మహిళా క్రికెటర్‌గా నిలిచారు. కాగా, గత కొన్నేళ్లుగా అవార్డుల ఎంపిక పట్ల పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్నాయి. ఎంపిక కమిటీలో మాజీ క్రీడాకారులు, ఉన్నత స్థానాల్లోని ఉన్న వ్యక్తులు, అధికారులు ఉన్నా.. పారదర్శకత లోపిస్తుందన్న ఆరోపణలు వస్తున్నాయి. అంతర్జాతీయ స్థాయిలో రికార్డులు కొల్లగొడుతున్న తెలుగు ఆర్చర్ జ్యోతి సురేఖ.. పట్ల కూడా ఖేల్‌రత్న అవార్డు ఎంపికలో వివక్ష ఎదురవుతున్నట్లు విమర్శలు వస్తున్నాయి. అత్యధిక పాయింట్లతో వరుసగా మూడు సార్లు ఖేల్‌రత్న రేసులో నిలిచినా.. సురేఖకు మొండి చేయి ఎదురైంది. గతంలో కూడా పారిస్ ఒలింపిక్స్‌లో రెండు పతకాలు సాధించిన షూటర్ మను బాకర్‌కు ఇదే సమస్య ఎదురైంది. వీరిద్దరు కోర్టులను ఆశ్రయించి మరీ తమను గుర్తించాలని మొరపెట్టుకున్న విషయం తెలిసిందే.






## నాకు 40 ఏళ్లు, ఆయనకు 54..

'దండోరా' ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో యాక్టర్ శివాజీ చేసిన వ్యాఖ్యలపై అనసూయ భరద్వాజ్ తీవ్రంగా స్పందించారు. ఇప్పటికే ఒకసారి శివాజీ కామెంట్స్ ని ఖండించిన అనసూయ.. ఆయన తనపై చేసిన వ్యాఖ్యలకు కౌంటర్‌గా వీడియోలు, పోస్టులు షేర్ చేస్తున్నారు. మహిళల స్వేచ్ఛ, వ్యక్తిగత ఎంపికలు, గౌరవం గురించి తనదైన శైలిలో ట్వీట్లు పెడుతున్నారు. వయసు ఆధారంగా చేసే విమర్శలను ఖండిస్తూ, సమాజం ఆలోచనా విధానంలో మార్పు రావాలని సూచించారు. 'దండోరా' ప్రీ రిలీజ్ ఈవెంట్ లో హీరోయిన్ల దుస్తులపై నటుడు శివాజీ చేసిన వ్యాఖ్యలు చేయడం తీవ్ర దుమారం రేపిన విషయం తెలిసిందే. దీనిపై యాంకర్ కమ్ యాక్టర్ అనసూయ భరద్వాజ్ రియాక్ట్ అయ్యారు. అయితే శివాజీ తన కామెంట్స్ పై వివరణ ఇచ్చే క్రమంలో, అనసూయ గురించి మాట్లాడారు. ఈ నేపథ్యంలో శివాజీకి కౌంటర్ ఇస్తూ అనసూయ ఓ వీడియో షేర్ చేశారు. ఇంస్టాగ్రామ్, ఎక్స్ వేదికగా వరుస పోస్టులు పెడుతున్నారు. "ఇతరులను కంట్రోల్ చేయడం అనేది బలంలా కనిపించే బలహీనత. రెస్పెక్ట్ అనేదే రియల్ పవర్" అంటూ అనసూయ పెట్టిన పోస్టులు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి."కొంతమంది పురుషులు.. ఇంకా కొంతమంది మహిళలు కూడా.. నా వయసును ఉపయోగించి నన్ను తక్కువగా చూపించడానికి.. నన్ను చిన్నగా భావింపజేయడానికి ప్రయత్నిస్తున్నారు.. ఈ విధమైన ఆలోచన కలిగిన వారు ఎక్కువగా ప్రగతిశీల మహిళలను లక్ష్యంగా చేసుకుంటారు.. ఇది మహిళలపై నియంత్రణ కోల్పోతామన్న భయం వల్ల.. అలాగే బలహీనమైన పితృస్వామ్య అహంకారాన్ని పోషించుకోవాలనే ఉద్దేశంతో జరుగుతుంది.." "ఇది అందరి పురుషుల గురించీ లేదా అందరి మహిళల గురించీ కాదు.. కానీ నేను పురుషులు.. మహిళలు.. అందరికీ విన్నపం చేస్తున్నాను.. దయచేసి విస్తృతంగా ఆలోచించండి.. పాత తరాలు నేర్చుకున్నవి లేదా అలవాటుపడ్డ ఆలోచనలు మనం తప్పనిసరిగా ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం లేదు. మనం మార్పును ఎంచుకోవచ్చు.. మన గౌరవాన్ని.. మన స్వేచ్ఛను కాపాడుకోవచ్చు.. ఒకరికొకరం శక్తినివ్వాలి.. మద్దతుగా నిలవాలి.. మన విలువ మన ఎంపికల నుంచే వస్తుంది.. మరే దానితో కాదు. అలానే కొంతమంది మీడియా బాధ్యతాయుతంగా వ్యవహరించాలి.. మీ పని బాధ్యతతో చేయాలి.. ఈ విధమైన మహిమాపరచడం (గ్లోరిఫికేషన్) సమంజసం కాదు / అభినందనీయం కాదు" అని అనసూయ తెలుగులో ఓ ట్వీట్ చేశారు. "ఇటీవల ఒక పబ్లిక్ ప్లాట్‌ఫామ్‌లో మహిళలు ఎలాంటి దుస్తులు ధరించాలి అనే దాని గురించి చేసిన కామెంట్స్ దృష్ట్యా.. ఇక్కడ ఒక విషయం గుర్తుచేసుకోవాలి. ప్రొటెక్షన్ పేరుతో కొంతమంది నియంత్రణను ఆందోళనతో తీర్పును ఎలా గందరగోళానికి గురిచేస్తారనేది ఆసక్తికరంగా ఉంది. డ్రెస్సింగ్ అనేది స్త్రీల పర్సనల్ ఛాయిస్. అది ఎవరినీ లక్ష్యంగా చేసుకోదు.. ఎవరికీ హాని కలిగించదు. కామెంట్స్, చూపులు, అయాచిత అభిప్రాయాలు వంటివి ప్రభావం చూపుతాయి. ఇన్ సెక్యూరిటీని మోరల్ పోలీసింగ్‌గా మార్చడం వల్ల అది రక్షణాత్మకంగా మారదు. అది దానిని నియంత్రించేలా చేస్తుంది. గౌరవానికి పర్యవేక్షణ అవసరం లేదు" అని అనసూయ పేర్కొన్నారు. "ప్రస్తుతం జరుగుతోన్న దాన్ని పక్కనపెడితే.. నేను ఏ విషయంలోనైనా నా అభిప్రాయాన్ని స్ట్రాంగ్ గా వినిపిస్తాను. దేనికీ ప్రభావితం కాకుండా ధైర్యంగా నిలబడతాను. ఎన్నో ఏళ్ల నుంచి సమాజంలో నిర్లక్ష్యం చేసిన అంశాన్ని అర్థమయ్యేలా చెప్పి, ప్రాతినిధ్యం వహించడమే నా ఉద్దేశం. ఎన్ని జరిగినా చెప్పింది చేయడానికి నేను ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటాను. మీరు అలా అసూయపడుతూనే ఉండండి.. మేం మరింత శక్తిమంతంగా, ఆకర్షణీయంగా ముందుకుసాగుతాం" అని అనసూయ తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. "ఈరోజుకి ఇంకొక్కటి చెప్తున్నా.. ఉన్నా ఇష్యూని అడ్రస్ చేయటం చేతకాక నన్ను ఏజ్ షేమింగ్ చేస్తూ ఆంటీ అంటున్న మగవాళ్ళు, ఆడవాళ్లు..ఆయన్ని మాత్రం 'గారు' అంటున్నారు.. కానీ నేను హిపోక్రైట్ ని అయిపోయాను. నాకు 40 ఏళ్లు.. ఆయనకి 54 అనుకుంటా. అయినా ఇద్దరం ప్రొఫెషన్ కోసమో, పర్సనల్ గానో ఫిట్‌నెస్ ని, గ్లామర్ ని మెయింటెయిన్ చేస్తున్నాం.. ఈ అనేవాళ్ళందరూ నిత్య యవ్వనులు. అది వేరే విషయం అనుకోండి. సర్లే.. ఇంకా ఇంతకంటే ఏం చెప్పిన చెవిటోడి ముందు శంఖం ఊదినట్టే.. మెర్రీ క్రిస్మస్. మంచి ఫుడ్ తినండి.. మనకు ఇష్టమైన వారితో సంతోషకరమైన సమయాన్ని గడపండి" అని అనసూయ మరో ట్వీట్ చేశారు.



## ఓటీటీలో 'ఆంధ్ర కింగ్ తాలూకా' సందడి..





థియేటర్లలో ఆశించిన విజయం సాధించని 'ఆంధ్ర కింగ్ తాలూకా' సినిమా నెల తిరక్కుండానే ఓటీటీలోకి వచ్చేసింది. రామ్ పోతినేని హీరోగా నటించిన ఈ చిత్రం నెట్‌ఫ్లిక్స్‌లో తెలుగుతో పాటు పలు భారతీయ భాషల్లో అందుబాటులోకి వచ్చింది. మరోవైపు ఎస్ ఎస్ రాజమౌళి క్రియేట్ చేసిన విజువల్ వండర్ 'బాహుబలి: ది ఎపిక్' కూడా ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతోంది. థియేట్రికల్ రిలీజైన ఎనిమిది వారాలకు డిజిటల్ ప్లాట్ ఫామ్ లోకి వచ్చింది. థియేటర్లలో ఆశించిన ఫలితాన్ని అందుకోలేకపోయిన చిత్రాలు, అప్పుడప్పుడు ఓటీటీ వేదికగా అద్భుతమైన విజయాన్ని సొంతం చేసుకుంటుంటాయి. ఇప్పుడు 'ఆంధ్ర కింగ్ తాలూకా' సినిమా విషయంలో ఇదే జరుగుతుందనిపిస్తోంది. రామ్ పోతినేని హీరోగా నటించిన చిత్రమిది. ఇప్పుడీ సినిమా ఓటీటీలోకి వచ్చేసింది. నెట్ ఫ్లిక్స్ వేదికగా స్ట్రీమింగ్ అవుతోంది. సోషల్ మీడియాలో పోస్టులు చూస్తుంటే, డిజిటల్ రిలీజులో ఈ చిత్రానికి పాజిటివ్ రెస్పాన్స్ వస్తున్నట్లు అర్థమవుతోంది.మహేష్ బాబు.పి దర్శకత్వంలో రామ్ – భాగ్యశ్రీ బోర్సే జంటగా నటించిన సినిమా 'ఆంధ్ర కింగ్ తాలూకా'. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించిన ఈ చిత్రంలో కన్నడ రియల్ స్టార్ ఉపేంద్ర కీలక పాత్ర పోషించారు. చాలాకాలంగా సక్సెస్ కోసం కష్టపడుతున్న హీరో రామ్.. ఈ సినిమాపై బోలెడన్ని ఆశలు పెట్టుకున్నారు. అయితే నవంబర్ 27న థియేటర్లలో రిలీజైన ఈ మూవీకి విమర్శకుల ప్రశంసలు దక్కాయి. అందరూ మంచి రేటింగ్స్ ఇచ్చారు. కానీ జనాలు మాత్రం థియేటర్లలో చూడటానికి పెద్దగా ఆసక్తి చూపించలేదు. దీంతో బాక్సాఫీస్ ఫెయిల్యూర్ గా మారింది. దీంతో ఈ సినిమా నెల తిరక్కుండానే డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లోకి వచ్చేసింది. 'ఆంధ్ర కింగ్ తాలూకా' సినిమా డిసెంబర్ 25 నుంచి నెట్ ఫ్లిక్స్ ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతోంది. తెలుగుతో పాటుగా హిందీ, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో అందుబాటులో ఉంది. విడుదలైన సమయంలో థియేటర్లలో పెద్దగా ప్రభావం చూపలేకపోయిన ఈ సినిమా, ఇప్పుడు డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లోకి వచ్చిన తర్వాత ఆదరణ పొందుతోంది. ఒక వీరాభిమాని బయోపిక్ గా రూపొందిన ఈ చిత్రానికి స్మాల్ స్క్రీన్ పై ప్రశంసలు దక్కుతున్నాయి. 2025లో వచ్చిన ఉత్తమ చిత్రాలలో ఇది ఒకటని, కానీ థియేటర్లలో తగినంత గుర్తింపు లభించలేదని, ఇప్పుడు ఓటీటీలో మాత్రం అస్సలు మిస్ అవ్వొద్దని ఎక్స్ లో నెటిజన్లు పోస్టులు పెడుతున్నారు. థియేటర్లలో మిస్ అయ్యాం కానీ, ఓటీటీలో చూశాక చాలా నచ్చింది అంటూ కామెంట్స్ చేస్తున్నారు. మరోవైపు 'బాహుబలి: ది ఎపిక్' మూవీ కూడా ఓటీటీలోకి వచ్చేసింది. దర్శక ధీరుడు ఎస్.ఎస్ రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కిన 'బాహుబలి: ది బిగినింగ్', 'బాహుబలి: ది కన్ క్లూజన్' చిత్రాలను కలిపి ఒకే సినిమాగా రిలీజ్ చేసిన సంగతి తెలిసిందే. అక్టోబర్ 31న థియేటర్లలో విడుదలైన ఈ చిత్రానికి ఆడియన్స్ నుంచి మంచి స్పందన లభించింది. బాక్సాఫీస్ దగ్గర రూ. 53 కోట్లకు పైగా కలెక్షన్స్ సాధించినట్లు ట్రేడ్ వర్గాలు వెల్లడించాయి. ఈ మూవీ ఓటీటీ స్ట్రీమింగ్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్న తరుణంలో.. 8 వారాల తర్వాత డిజిటల్ వేదిక మీదకొచ్చింది. 'బాహుబలి: ది ఎపిక్' నెట్‌ఫ్లిక్స్ వేదికగా అందుబాటులోకి వచ్చింది. అయితే ఇది ప్రభాస్ అభిమానులను అటు సంతోషానికి, ఇటు నిరాశకు గురిచేస్తోంది. దీనికి కారణం కేవలం హిందీ వెర్షన్‌లో మాత్రమే ఈ సినిమా స్ట్రీమింగ్ అవుతోంది. తెలుగుతో పాటు ఇతర దక్షిణాది భాషల్లో చూడాలని ఆశపడ్డ ఫ్యాన్స్.. సోషల్ మీడియాలో అసహనం వ్యక్తం చేస్తున్నారు. కాకపోతే హిందీలో చూసినవారంతా ఇదొక మాస్టర్ పీస్ అని కొనియాడుతున్నారు. ప్రస్తుతానికి హిందీ ఆడియన్స్‌కు మాత్రమే ఈ సినిమాని ఎక్స్ పీరియన్స్ చేస్తున్నారు. మిగిలిన భాషల వెర్షన్లను ఎప్పుడు అప్‌లోడ్ చేస్తారు? ఏ ఓటీటీలో స్ట్రీమింగ్ చేస్తారు? అనే దానిపై ఇంకా ఎలాంటి స్పష్టత రాలేదు.

## రామ్ చరణ్ 'పెద్ది' సినిమాపై విమర్శలు..






నటుడు శివాజీ ఇటీవల హీరోయిన్ల దుస్తులపై చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. ఆయన ఇప్పటికే క్షమాపణలు చెబుతూ ఓ వీడియో రిలీజ్ చేశారు. అయితే తన మాటలకు కట్టుబడే ఉన్నానని శివాజీ తెలిపారు. తాను మాట్లాడిన మాటల్లో రెండు తప్పు పదాలు దొర్లాయని, దానికి మాత్రమే సారీ చెబుతున్నానని అన్నారు. అనూహ్యంగా ఈ వివాదంలోకి 'పెద్ది' సినిమా వచ్చి చేరింది. ఈ ఇష్యూలో శివాజీకి సపోర్ట్ చేస్తున్న సెలబ్రిటీలు, నెటిజన్లు.. రామ్ చరణ్ పాటపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. నటుడు శివాజీ వివాదం చిలికి చిలికి ఇప్పుడు 'చికిరి చికిరి' పాటపైకి వచ్చి పడింది. అటు తిరిగి ఇటు తిరిగి చివరికి 'పెద్ది' సినిమాకి చుట్టుకునేలా కనిపిస్తోంది. ఇటీవల 'దండోరా' ఈవెంట్ లో హీరోయిన్ల డ్రెస్టింగ్ పై శివాజీ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. గంటల వ్యవధిలోనే క్షమాపణలు చెబుతూ వీడియో రిలీజ్ చేశారు. అక్కడితో అంతా అయిపోయిందని అనుకుంటే, తన వివాదాన్ని తానే కొత్త మలుపు తిప్పాడు శివాజీ. సారీ చెప్పిన రెండో రోజే మాట మార్చారు. తన స్టేట్మెంట్ కి కట్టుబడి ఉన్నానని, కానీ తాను మాట్లాడిన దాంట్లో రెండు పదాలకు మాత్రమే క్షమాపణలు చెబుతున్నానని అన్నారు. తను మాట్లాడింది కరెక్ట్ అంటూ సమర్థించుకున్నారు. అయితే శివాజీ మాట్లాడింది తప్పైతే, 'చికిరి చికిరి' పాటలో లిరిక్స్ కూడా తప్పే కదా అనే వాదన తెర మీదకి వచ్చింది.'దండోరా' ప్రీ రిలీజ్ ఈవెంట్ లో శివాజీ మాట్లాడుతూ.. "హీరోయిన్ల అందం నిండుగా కప్పుకునే దుస్తుల్లోనే ఉంటుంది తప్ప, సామాన్లు కనిపించేలా వస్తే ఉండదు. సామాన్లు కనిపించే దుస్తులు వేసుకున్నప్పుడు చూసినవాళ్లు పైకి నవ్వుతారు కానీ, లోపల మాత్రం 'దరిద్రపు ముండ' ఇలాంటి బట్టలు వేసుకుంది ఏంటి అని తిట్టుకుంటారు" అని అన్నారు. ఇదే ఆయన్ని వివాదంలో లాగింది. సినీ ప్రముఖులు, మహిళా సంఘాలు, హీరోయిన్లు శివాజీ వ్యాఖ్యలను ఖండించారు. స్త్రీలను కించపరిచారంటూ మండిపడ్డారు. హీరోయిన్లు ఎలాంటి డ్రెస్సులు వేసుకోవాలో చెప్పడానికి నువ్వెవరు అంటూ ఫైర్ అయ్యారు. అనసూయ భరద్వాజ్, చిన్మయి, మంచు లక్ష్మి, పాయల్ రాజ్ పుత్, రామ్ గోపాల్ వర్మ, మంచు మనోజ్ లాంటి వాళ్లు శివాజీ కామెంట్స్ ను ఖండిస్తూ పోస్టులు పెట్టారు. అయితే ఈ వివాదంలో శివాజీకి ఓ వర్గం నుంచి మద్దతు లభిస్తోంది. నటుడు మాట్లాడిన దాంట్లో తప్పేమీ లేదని సోషల్ మీడియాలో కామెంట్స్ చేస్తున్నారు. సినిమా హీరోయిన్లు బయటికి వచ్చేటప్పుడు సాంప్రదాయబద్ధంగా దుస్తులు ధరించమని ఆయన సూచించారని, సరిగ్గానే మాట్లాడారని సమర్థిస్తున్నారు. పదజాలం విషయంలో కొన్ని తప్పులు ఉండచ్చు కానీ, ఆయన సమాజ శ్రేయస్సు దృష్ట్యా మాట్లాడిన భావజాలం మాత్రం తప్పు కాదని అంటున్నారు. కరాటే కళ్యాణి, శేఖర్ భాషా లాంఅభ్యంతరంటి కొందరు సెలబ్రిటీలు కూడా శివాజీకి సపోర్టుగా నిలుస్తున్నారు. ఈ క్రమంలో 'పెద్ది' సినిమాని వివాదంలోకి లాగుతున్నారు. శివాజీ మాట్లాడిన సామాన్లు పదంపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్న వారు.. 'చికిరి చికిరి' పాటలోని లిరిక్స్ పై ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నిస్తున్నారు.రామ్ చరణ్, జాన్వీ కపూర్ హీరోహీరోయిన్లుగా బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కుతున్న సినిమా 'పెద్ది'. ప్రమోషన్స్ లో భాగంగా ఆ మధ్య 'చికిరి చికిరి' అనే పాటను విడుదల చేశారు. ఏఆర్ రెహమాన్ స్వరపరిచిన ఈ సాంగ్ చార్ట్ బస్టర్ గా నిలిచింది. మిలియన్ల వ్యూస్, లక్షల కొలదీ లైక్స్ తో దూసుకుపోతోంది. పాట మధ్యలో "పడతా పడతా పడతా ఎనుకే ఎనుకే పడతా.. సరుకు సామాను సూసి మీసం లేసి ఏసే కేక" అనే లిరిక్స్ వినిపిస్తాయి. హీరోయిన్ ని ఉద్దేశిస్తూ హీరో పాడుకునే ఈ సాహిత్యాన్నే ఇప్పుడు శివాజీ వివాదంలోకి తీసుకొస్తున్నారు. శివాజీ మాట్లాడింది తప్పైతే.. రామ్ చరణ్ సినిమాలోని 'పెద్ది' పాట కూడా తప్పే కదా అని కరాటే కళ్యాణి ప్రశ్నించింది. ఒక పెద్ద హీరో సినిమాలో స్త్రీని వర్ణిస్తూ 'సామాన్లు' అనే పదం వచ్చినప్పుడు ఎవరూ అభ్యంతరం చెప్పలేదని, ఒక్కరు కూడా నెగెటివ్ కామెంట్ చేయలేదని, పైగా ఆ పాటను అందరూ ఎంజాయ్ చేశారని, చాలామంది ఆ పాటలకు రీల్స్ కూడా చేశారని బిగ్ బాస్ ఫ్యాన్ శేఖర్ భాషా అన్నాడు. పాటలో ఆ పదం తప్పు కానప్పుడు, శివాజీ ఆవేదనతో అదే పదం అంటే తప్పు అయిందా? అని వాదిస్తున్నాడు. ఒక వ్యక్తిని టార్గెట్ చేయడానికి కోడిగుడ్డు మీద ఈకలు పీకినట్లు ప్రవర్తిస్తున్నారని, అందరూ ఒకేసారి దాడి చేయడం సరికాదని అన్నాడు.

## 'స్పిరిట్' డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా బర్త్ డే..






అర్జున్ రెడ్డి, కబీర్ సింగ్, యానిమల్ సినిమాలతో సంచలనం సృష్టించిన డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా.. ఇప్పుడు రెబల్ స్టార్ ప్రభాస్‌తో 'స్పిరిట్' అనే కాప్ డ్రామా తెరకెక్కిస్తున్నారు. ఈ పాన్ వరల్డ్ సినిమాపై అభిమానుల్లో భారీ అంచనాలున్నాయి. ఇందులో ప్రభాస్ పవర్ ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా కనిపించనున్నారు. సందీప్ వంగా పుట్టినరోజు సందర్భంగా ప్రభాస్, వివేక్ ఒబెరాయ్ సోషల్ మీడియాలో ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. 'అర్జున్ రెడ్డి' వంటి ట్రెండ్ సెట్టింగ్ సినిమాతో టాలీవుడ్ లో డైరెక్టర్ గా పరిచయమయ్యారు సందీప్ రెడ్డి వంగా. డెబ్యూ మూవీతోనే ఇండస్ట్రీ చూపు తనవైపు తిప్పుకున్నారు. మొదటి సినిమాతోనే తనకంటూ ఒక ప్రత్యేకమైన మార్కును సెట్ చేసుకున్న ఆయన, ఆ తర్వాత అదే చిత్రాన్ని బాలీవుడ్‌లో 'కబీర్ సింగ్'గా రీమేక్ చేసి అక్కడ కూడా సంచలనం సృష్టించారు. దీంతో ఇండియన్ సినిమాలో మోస్ట్ వాంటెడ్ డైరెక్టర్‌గా మారిపోయారు. ఇక గతేడాది ఆయన్నుంచి వచ్చిన 'యానిమల్' సినిమా బాక్సాఫీస్ వద్ద బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ గా నిలిచింది. దీంతో సందీప్ వంగా రాబోయే సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి.సందీప్ రెడ్డి వంగా ప్రస్తుతం పాన్ ఇండియా స్టార్ ప్రభాస్‌తో 'స్పిరిట్' అనే భారీ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఇదొక కాప్ డ్రామా. ఇందులో ప్రభాస్ ఒక పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపించబోతున్నారు. ఇప్పటివరకు చూడని సరికొత్త లుక్ లో ప్రభాస్‌ను చూపించబోతున్నారు. ఇటీవలే మెగాస్టార్ చిరంజీవి చేతుల మీదుగా ఈ క్రేజీ ప్రాజెక్ట్ ప్రారంభమైంది. నేడు సందీప్ వంగా పుట్టినరోజు కావడంతో సోషల్ మీడియాలో ఆయనకు శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభాస్ సైతం సందీప్‌కు ప్రత్యేకంగా విషెస్ తెలియజేశారు. "హ్యాపీ బర్త్ డే బ్రో.. నువ్వు క్రియేట్ చేస్తున్న దాన్ని అందరికీ చూపించడం కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను" అని ప్రభాస్ ఇన్స్టాగ్రామ్ స్టోరీ పెట్టారు. సందీప్ రెడ్డి వంగా ఫోటోని షేర్ చేశారు. అలానే 'స్పిరిట్' సినిమాలో కీలక పాత్ర పోషిస్తున్న బాలీవుడ్ యాక్టర్ వివేక్ ఒబెరాయ్ కూడా సందీప్‌ను ప్రశంసిస్తూ పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. "హ్యాపీ బర్త్ డే బ్రదర్ సందీప్. భావోద్వేగాలతో నిండిన, ఎలాంటి పరిమితులు లేని ఒక రోజు నీకు లభించాలని కోరుకుంటున్నాను. నాకు, నాన్నకు మీరు ఎల్లప్పుడూ చూపించిన ప్రేమకు గౌరవానికి ధన్యవాదాలు, మీరు మాకు డైరెక్టర్ కంటే ఎక్కువ" అని వివేక్ ఒబెరాయ్ ట్వీట్ చేశారు. 'స్పిరిట్' చిత్రాన్ని టి-సిరీస్, భద్రకాళి పిక్చర్స్ బ్యానర్లపై అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. పాన్ వరల్డ్ మూవీగా తెలుగుతో పాటు, ఇంగ్లీష్, హిందీ, తమిళ, మలయాళ, కన్నడ, చైనీస్, జపనీస్, కొరియన్ భాషల్లో రూపొందించనున్నారు. ఇందులో ప్రభాస్ సరసన త్రిప్తి దిమ్రి హీరోయిన్ గా నటిస్తుండగా.. వివేక్ ఒబెరాయ్, ప్రకాష్ రాజ్, కాంచన కీలక పాత్రలు పోషిస్తున్నారు. హర్షవర్ధన్ రామేశ్వర్ సంగీతం సమకూరుస్తున్న ఈ సినిమాకి భూషణ్ కుమార్, ప్రణయ్ రెడ్డి వంగా నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. ప్రభాస్ బర్త్ డే సందర్భంగా రిలీజైన 'స్పిరిట్ – వన్ బ్యాడ్ హ్యాబిట్' ప్రోమో ఆకట్టుకుంది.

Owned by Katikala Vara Prasad,Printed at Sunday printing press 3_4297 Saraswati complex SVN colony. guntur.ap 522006. Published by Banka Indira . at D.no. 465 Le out no2. Dodleru Road. Ysr jagananna colony. Krosuru.Guntur AP. 522410. Editor. Katikala Vara Prasad.RNI APTEL/2015/62250. Ph:9849707349 email:kvp6858@gmail.com